# మంగళసూత్రం

**పి. గణపతి శాస్త్రి**




ఆ వేళ పొద్దున్నే వైదేహి వివాహం. సరిగా పదిగంటలకే శుభముహూర్తం. తన కుమార్తె వివాహానికి వెంకటేశ్వర కల్యాణమండపంలో అన్ని ఏర్పాట్లు చేసుకున్నాడు పద్మనాభం.

ఇంతకు మునుపు అతను ముగ్గురాడపిల్లల పెళ్ళిళ్ళు చేశాడు. ఆపైన పెద్దబ్బాయి పెళ్ళికూడా ఘనంగానే జరిపించాడు.

కాని, వైదేహి పెళ్ళి తలపెట్టినప్పటి నించి పద్మనాభం పడ్డ శ్రమ ఇంతా అంతా కాదు. ఎన్నెన్ని విధాల, కాళ్ళకి బలపాలు కట్టుకుని తిరిగినా కాస్త నాలుగు వేళ్ళు నోట్లోకి వెళ్ళిన సంబంధం ఒక్కటీ కలిసిరాలేదు! కాని, ఎలాగయితేనేం, చిట్టచివరికి చాలా మంచి సంబంధమే కుదిరిందని సంతృప్తి పడ్డాడు.

వరుడు సోమసుందరం ఇటీవలే ఎమ్. బి. బి. ఎస్. పాసయి హౌస్ సర్జనుగా పనిచేస్తున్నాడు. ఆపైన అతనికి పది ఎకరాల భూమి, ఒక చిన్న మేడకూడా ఉన్నాయి. అన్నదమ్ములు ఎవళ్ళూ లేరు. అక్కలు ఇద్దరున్నారు గాని, వివాహం అయి అత్తవారిళ్ళలో వాళ్ళ కాపరాలు వాళ్ళు చేసుకుంటున్నారు.

సోమసుందరం అంత రూపసి కాదు. అలాగని అందవికారి మాత్రం కాదు. నల్లగా ఉంటేనేం, కొంత కను ముక్కు తీరున్న ముఖం. అయితే, సన్నగా బక్క పలచగా ఉంటాడు. నల్లని కళ్ళమీద రోల్డ్‌గోల్డ్ ఫ్రేమ్ కళ్ళద్దాలు పెట్టుకుంటాడు. కనకనే చూడడానికి కాస్త నదురుగా కనిపిస్తాడు. అదీగాక అతగాడు చాలా చలాకీ మనిషి. కులాసాగా నవ్వుతూ, పేలుతూ ఉంటాడు.

ఇక వైదేహి అతని కన్న రవంత

అందంగానే కనిపిస్తుంది. ఎరుపు వన్నెతో కలిసిన పచ్చని పసిమి రంగు. చక్రాల లాంటి కళ్ళు. నవ్వితే చెక్కిళ్ళ మీద చిన్న చిన్న సొట్టలు సుళ్ళు తిరుగుతాయి. మొత్తంమీద వైదేహి చక్కని చుక్కల్లోనే లెక్క.

ఆ అమ్మాయి సోమసుందరం పక్కన నిలబడితే కాకి ముక్కుకి కట్టిన దొండ పండులా ఉంటుందని ఇరుగు పొరుగులు కొందరు గుసగుస లారంభించారు. ఆ మాటలన్నీ ఆ నోట ఆ నోట నాని, వైదేహి తల్లి వర్ధనమ్మ దాకా పాకి పోయాయి. అయితే, దాని కావిడ తనలో తానే సరిపెట్టుకుంది. 'ఏమిటో, కాస్త నలుపన్న మాటే గాని, ఆ అబ్బాయి బాగానే ఉన్నాడు. ఆఁ అంద చందాలుంటే మాత్రం కొరుక్కు తింటారా, ఏమన్నానా? కాస్త ఆస్తి పాస్తులు, మంచి ఉద్యోగము ఉండాలి! అంతే! వట్టి చూపుల గుర్రమయితే మాత్రం లాభమేమిటి?'

ఆ తరవాత వైదేహికి కూడా అదే ధోరణిలో నచ్చచెప్పింది. ఆ అమ్మాయి ఆ పీజే బి. ఏ. పాసయింది. పైగా స్వతః తెలివయిన పిల్ల. తల్లితండ్రు లిద్దరు కలిసి నచ్చచెప్పిన తరవాత మరి కాదనలేకపోయింది. అయితే, కట్న కానుకల వ్యవహారమే ఎంతకీ తెగలేదు. ఆడబడుచుల కిద్దరికి ఇవ్వవలసిన లాంఛనాలతో కలిపి మొత్తం పదహారు వేల రూపాయల దాకా ముట్ట జెప్పాలని మధ్యవర్తి మహేశం పట్టు పట్టాడు. అంటే, లాంఛనాల కోసం ప్రత్యేకించి వెయ్యి రూపాయి లెక్కువగా ఇవ్వాలని గట్టిగా రొక్కాయించాడు. అయితే, పద్మ నాభం అంతదాకా తూగలేనని వెనకంజ వేశాడు.

కాని, మధ్యవర్తి అంతమాత్రాన అతనిని విడిచి పెట్టలేదు. దాని కొక గట్టి కారణం కలిసి వచ్చింది. వైదేహి సోమసుందరానికి బాగా నచ్చింది. ఇంకెవ రన్నా అంతకన్న కట్న కానుక లెక్కువగా ఇస్తామన్నా, పిల్ల అతనికి నచ్చకపోతే మరి చెయ్యగలిగిందేమీ లేదు. నిజానికి అతనికి ఇంతకు మునుపే ఇరవై వేల దాకా కట్నం పలికింది. అయినా, పదిహేను వేలకన్న ఎక్కువ ఇచ్చుకోలేనని పద్మనాభం రొక్కాయించినా, సోమసుందరం తండ్రి సూర్యానికి అంగీకరించక తప్పలేదు.

ఆ వేళ అప్పుడే ఏడు గంటలు కావస్తోంది. అయితే, మగ పెళ్ళి వారి విడిదిలో ఎక్కడా కదలికే లేదు! వాళ్ళు అసలు పెళ్ళి ప్రయత్నంలో పడ్డట్టే కనిపించలేదు. 'ఏమిటి చెప్మా, వియ్యంకుడు గారు ఇంత ముభావంగా ఉన్నారీ వేళ!' పద్మనాభం కొంచెం కంగారు పడ్డాడు.

అంతలోనే మధ్యవర్తి మహేశం రొ జుకుంటూ అతనికి దగ్గరకి వచ్చాడు.

''ఏమిటయ్యా, విశేషాలు?''

ఎంతో ఆత్రంగా అడిగాడు పద్మ నాభం.

''ఆఁ విశేషా లేమున్నాయి! ఆ మిగిలిన మూడు వేలుకూడా ఇప్పుడే తెప్పించమన్నాడు మీ వియ్యంకుడుగారు!''

మహేశం నెమ్మదిగా పళ్ళు నములుతూ అన్నాడు. పద్మనాభం తన కాబోయే వియ్యంకుడి చేతిలో అంతకు మునుపే పన్నెండు వేలు పోశాడు. ఆ పైన మిగిలిన మూడు వేల రొక్కము పెళ్ళి పీటల మీద కూర్చోక మునుపే చేతి కందియ్య గలనని గట్టిగా మాట ఇచ్చాడు. కాని, ఎంతగా కాళ్ళు నిలదొక్కుకున్నా, ఆ సొమ్ము అనుకున్న సమయానికి అతని చేతి కందలేదు. అయితే, ఆ సొమ్మంతా ఆ మరునాటి సాయంకాలం లోగా తప్పక ముట్టచెప్పగలనని మధ్యవర్తి ద్వారా మాట ఇచ్చాడు పద్మనాభం. కనక శుభ ముహూర్తం దాటిపోకుండా వధూ వరుల నిద్దరిని పెళ్ళిపీటల మీద కూర్చోనియ్య వలసిందని మధ్యవర్తి ద్వారా బతిమాలు కున్నాడు.

కాని, పెళ్ళికొడుకు తండ్రి ససేమిరా వల్లకాదు పొమ్మన్నాడు. అప్పటికప్పుడు ఆ మూడు వేలు తన చేతిలో పోస్తే తప్ప పిల్లవాడి చేత పిల్ల మెడలో మంగళసూత్రం కట్ట నియ్యనని మూతి బిగించుకుని కూర్చున్నాడు.

ఆ గడ్డు పరిస్థితిలో పద్మనాభానికి నోరెండిపోతున్నట్టనిపించింది. ఎవ్వ రయినా ఆ సమయంలో ఒక్క మూడు వేలు అప్పుగా ఇస్తే ఆ గండం దాటి బయట పడవచ్చును! కాని, అంత ఆత్మీ యంగా ఎవ్వ రాదుకుంటారు? అంతటి ఆత్మీయులున్నా నిలుచున్న పళంగా ఆ క్షణంలో అంత సొమ్ము ఎక్కడి నించి తేగలరు?

అదే సమయంలో మగపెళ్ళివారి విడిదిలోకూడా పెద్ద రభస చెలరేగింది. సూర్యానికి అదంతా పచ్చి మోసంలా కనిపించింది. పెళ్ళికొడుకు తండ్రికే అలా అనిపించిన తరవాత ఇక మిగిలిన వారి మాట చెప్పేదేమిటి? అందరికి అది ఆ మూడు వేలు ఇవ్వకుండా ఎగ్గొట్టడానికి వేసిన పన్నాగంలా కనపడింది. అదే మాట నలుగురి లోనూ గట్టిగా పైకి అనేశాడు సూర్యం. అది ఆ సమయంలో అక్కడికి వెళ్ళిన మహేశం చెవిని పడింది. వెంటనే అతడు వియ్యంకుడి చేతులు రెండూ గట్టిగా పట్టుకున్నాడు.

''మీ వంటి వారు అలాంటి మాట అనడం భావ్యం కాదు, బాబుగారూ! ఎంతగా ప్రయత్నించినా సమయానికి సొమ్ము చేతి కందలేదు! ఆడపిల్లని కన్న తండ్రి గదా, పద్మనాభంగారు! వియ్యం కుణ్ణీ, అల్లుణ్ణీ మభ్య పెట్టి మోసగించి తా నేం బావుకుంటాడు, చెప్పండి? కాస్త నిదానించి రేపు సాయంత్రం దాకా గడువివ్వండి! శుభముహూర్తాన్ని కడ్డు పడకండి! మేము కోరుకునే దింతే!''

అయినా, సూర్యంగాని, సోమసుందరం గాని, మిగిలిన బంధువులు గాని దాని కెంత మాత్రము అంగీకరించలేదు! పైగా ఒక అరగంటలోగా మిగిలిన సొమ్మంతా తమ కందకపోతే, ఇక ఆ పెళ్ళి మాటే తలపెట్ట దలుచుకోలేదని నిక్కచ్చిగా హెచ్చరించారు. వెంటనే తిరిగి వెళ్ళిపోగలమని బెదిరించారు.

మధ్యవర్తి మహేశం నోట మరి మాట పెగలలేదు! ఒక్క అంగలోనే తిరిగి వచ్చి, జరిగిన దంతా పూస గుచ్చినట్టు పద్మ నాభం చెవిని వేశాడు. అది వినీ వినగానే అతని గుండె భగ్గుమని మండింది!

ఇన్నాళ్ళనించి ఇన్ని పెళ్ళిళ్ళు చేసినా అతని గౌరవానికి ఎక్కడ ఏమాత్రము భంగం కలగలేదు! ఇంక ఇప్పుడేం చెయ్యాలి? ఎంతటి తలవంపు కలిగింది! ఇన్ని విధాల లెక్కలు ముక్కలు చేసుకున్న తరవాత పీటలమీద పెళ్ళి ఆగిపోవలసిందేనా? ఆ సమయంలో కొత్త పెళ్ళికూతురయి కలకలలాడుతున్న వైదేహిని చూడగానే అతని గుండె చెరువయింది.

ఆ అమ్మాయికికూడా కన్నీరు నిండింది. పెళ్ళి అంటే, మంగళసూత్రం కట్టడమంటే ఇంతేనన్నమాట! ముచ్చటగా మూడు వేలు మీదే ఆ మూడు ముళ్ళు ఆధారపడి ఉన్నాయన్న మాట! పది మందిలోనూ తల ఎత్తుకుని తిరుగుతున్న తన తండ్రి మాటమీద కాబోయే తన మామగారికి నమ్మకమంత యినా గౌరవం లేదన్న మాట! కాబోయే తన భర్త కిదంతా అసలు పట్టనే పట్ట దన్న మాట. వైదేహి లోలోపలే నిలువునా కాలి మసి అయింది. చరచరా తండ్రి దగ్గరికి వెళ్ళిపోయింది.

''నాన్నగారూ, నాకీ పెళ్ళి అక్కర లేదు! నే నీ పెళ్ళికొడుకుని చేసుకోను!''

'ఏం, ఎందుచేత?' అప్పటట్టు కూతురు ముఖం కేసి కంగారుగా చూశాడు పద్మ నాభం. అంతలోనే వైదేహి కప్పుకుంది.

''ఇదేమన్నా గాని, బీరకాయల బేరమా? వాళ్ళు కాస్త మన కష్ట సుఖా లాలోచించ క్కరలేదా?''



